క్లుప్తంగా

శింగరకొండలో కరణం వెంకటేష్ పూజలు


ప్రత్యేక పూజల అనంతరం కరణం వెంకటేష్

అద్దంకి: చీరాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేశ్ మంగళవారం ప్రసన్నాంజనేయ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు. పార్టీకి చెందిన పలు విభాగాల నాయకులు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయునికి అరటి పండ్ల పూజ


అరటిపండ్ల పూజలో ప్రసన్నాంజనేయుడు

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి అమావాస్య సందర్భంగా మంగళవారం పదివేల అరటి పండ్లతో ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. అలాగే క్షేత్రప్రాధాన్యత గల మంగళవారం కావడంతో నూతనంగా నిర్మించిన రాతిముఖ మండపంలో భక్తులు అధిక సంఖ్యలో ఆకుపూజలు నిర్వహించారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించండి

ఇంకొల్లు(చినగంజాం): రేషన్ డీలర్‌లు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తహసీల్దార్ వెంకటరత్నం అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు రేషన్ షాపు తెరచి ఉంచాలని ఆయన తెలియజేశారు. సివిల్ సప్లయిస్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సురేష్, రేషన్ డీలర్‌లు పాల్గొన్నారు.

వైభవంగా వైశాఖ అమావాస్య అన్నదానం

అద్దంకి: పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద మగళవారం వైశాఖ అమావాస్య సందర్భంగా అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి అద్దంకి శాఖ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆకుల రామశేషారావు జ్ఞాపకార్థం వారి కుమారుడు శివరామకృష్ణ, కుటుంబ సభ్యుల సౌజన్యంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వాసు గురుస్వామి, తిరుపతి రెడ్డి గురుస్వామి పర్యవేక్షించారు. పెద్దన్న గురుస్వామి, మంగమూరి సురేశ్, తోట చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం కోదండరాముని కల్యాణం


స్వామివారి కల్యాణ క్రతువును నిర్వహిస్తున్న అర్చక బృందం

యద్దనపూడి: మండలంలోని చింతగుంటపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ సీతా లక్ష్మణ ఆంజనేయ సమేత కోదండరామ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. సుమంగళ వాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణలు, జైశ్రీరామ్ నినాదాల నడుమ కల్యాణ వేడుక ఒక్కొక్క ఘట్టం కమనీయంగా సాగింది. మూడుముళ్ల బంధంతో ఒక్కటైన కోదండరాముని కల్యాణోత్సవాన్ని కనులార్పకుండా చూసి భక్తులు పరవశించిపోయారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ఏపీఈఏపీ సెట్ పరీక్షలకు 234 మంది హాజరు

వేటపాలెం: సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో జరుగుతున్న ఏపీఈఏపీ సెట్ పరీక్షలకు 234 మంది విద్యార్థులు హాజరైనట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్. లక్ష్మణరావు మంగళారం తెలిపారు. ఆన్‌లైన్ పద్ధతిలో జరగుతున్న పరీక్షలకు చివరి రోజున 240 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 234 మంది హాజరైనట్లు తెలిపారు. ఆరుగురు విద్యార్థులు పరీక్షలకు గైరు హాజరైట్లు తెలియజేశారు. ఏపీఈఏపీ సెట్ ఆన్‌లైన్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయన్నారు.

బదిలీలలు.. సిఫారసులు

- ఉద్యోగుల్లో ఉత్కంఠగా బదిలీల ప్రక్రియ
- ముఖ్య శాఖల అధికారులకూ..
- అనువైన ప్రాంతాల్లో పోస్టింగుల కోసం తిప్పలు
- రాజకీయ నేతల చుట్టూ ప్రదక్షిణలు


చీరాల మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం

చీరాల టౌన్: మండల పరిధిలో ప్రభుత్వం చేపట్టిన ఉద్యోగుల బదిలీల వ్యవహారం ఉత్కంఠత రేపుతోంది. ప్రస్తుత స్థానాల్లో మూడేళ్లు పూర్తి చేసుకున్న ఉద్యోగులందరికీ బదిలీ తప్పనిసరి కావడంతో ఎవరికెవరు తమ ఏర్పాట్లు చేసుకుంటూ కార్యాలయాల్లో కౌన్సిలింగ్ కోసం అర్జీలు అందిస్తున్నారు.

చీరాల అంటే అయిష్టత ఎందుకో!

చాలా మంది ప్రభుత్వ ఉద్యోగులు చీరాల్లో తాము పనిచేయమని వేరే ప్రాంతానికి వెళ్లిపోదామని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. చీరాలలో పంచాయతీరాజ్ మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు, రెవెన్యూ ఉద్యోగులు సైతం చీరాల మండలం నుంచి వేరే ప్రాంతానికి బదిలీ చేసుకునే యత్నాల్లో బిజీగా ఉన్నారు. అలానే మండల పరిషత్ కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బంది కూడా ఇలాంటి నిర్ణయమే తీసుకున్నారు. అలాగే వ్యవసాయ శాఖ, ఎన్ఆర్ఈజీఎస్, ఐకేపీ, పశుసంవర్ధక శాఖ, ఆరోగ్య శాఖ, ఆర్అండ్‌బీ శాఖల అధికారులు, సిబ్బంది, అటెండర్లు సైతం తమ ఫైళ్లు పట్టుకుని పరుగులు తీస్తున్నారు.

మన వారేనా?

సాధారణంగా ప్రభుత్వ శాఖల్లోని అధికారులు ఒక ప్రదేశంలో మూడేళ్ల నుంచి ఐదేళ్ల పాటుగా విధులు నిర్వహిస్తుంటారు. ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలకు ఆమోదం తెలపడంతో ఎవరి ప్రయత్నాల్లో వారు నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. చీరాల్లో ముఖ్యశాఖలకు నూతన అధికారులు విధుల్లోకి రానున్నారు. ఇందులో 5 ఏళ్లు పూర్తి చేసుకున్నవారు మాత్రం ఏ ప్రాంతమైనా తమకు ఇబ్బంది లేదనే ధీమాలో ఉన్నారు. బాపట్ల జిల్లాతో పాటు ప్రకాశం జిల్లా, గుంటూరు జిల్లా నుంచి ప్రతి రోజూ చీరాల వచ్చి విధులు నిర్వహించే ఉద్యోగులు కూడా ఉన్నారు. ఇలాంటి వారంతా ప్రస్తుతం తాము నివాసం ఉండే ప్రాంతాలకు దగ్గరగా బదిలీలు చేయించుకొనేందుకు ముఖ్యనేతల సిఫార్సు కోసం తిరుగుతున్నారు. ఇదిలా ఉంటే సామాజిక సమీకరణాలు, మన పార్టీ వారా కాదా? అనే కోణంలో నియోజకవర్గ ముఖ్య నేతలు బదిలీలు, పోస్టింగుల కోసం వస్తున్న వారి నుంచి వివరాలను సేకరిస్తున్నారు. మీరు చెప్పిందే చేస్తాం.. అనే ఉద్యోగుల కోసం కూటమి నేతలు పలురకాల విచారణలు చేస్తున్నారనే సమాచారం అందుతోంది. ఏదేమైనా మరో వారం రోజుల్లోగా చీరాల్లోని పలు శాఖల్లో కొత్త అధికారులు, ఉద్యోగులు విధుల్లో చేరే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

నాణ్యతా ప్రమాణాలతో రాజీ వద్దు


ముప్పవరం గ్రామంలో ఉపాధి పనులను పర్యవేక్షిస్తున్న సెంట్రల్ టీం సభ్యులు

జె.పంగులూరు: మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పనులను మండలంలోని ముప్పవరం, కల్లంవారిపాలెం గ్రామాల్లో మంగళవారం సెంట్రల్ టీం సభ్యులు పర్యవేక్షించారు. ఢిల్లీ నుంచి వచ్చిన కేసీ ఆండర్ సెక్రటరీ ఏరియా ఆఫీసర్ అనిల్ కుమార్, సెక్షన్ ఆఫీసర్ అరుణ్ కుమార్ మౌర్య ఉపాధి హామీ పథకం పనులు, దాని అనుసంధానం పనులైన పంచాయతీ రాజ్ పనులు, గృహనిర్మాణ శాఖ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనుల్లో ఎలాంటి అలసత్వం, నిర్లక్ష్యం చూపకుండా నాణ్యత ప్రమాణాలతో పనులు జరిగేలా చూడాలని కోరారు. ఈ పథకం ద్వారా వచ్చే పనులు అర్హులైన లబ్ధిదారులకు అందే విధంగా చూడాలని కోరారు. ఎక్కడైనా ఎలాంటి లోపాలు జరిగితే సిబ్బంది భాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. సిబ్బంది పర్యవేక్షణలో సక్రమంగా పనులు జరిగే విధంగా చూడాలని కోరారు. ఈ సందర్భంగా ముప్పవరం గ్రామ పంచాయతీ పరిధిలోని పిన్నాక నాగమల్లేశ్వరి మామిడి తోటను, ఆదిలక్ష్మి పశువుల కొష్టం పరిశీలించారు. ఏపీడీ కోటయ్య నాయక్, డిప్యూటీ ఎంపీడీవో సుమంత్, ఏపీఓ సంతోషం, ఏపీఎం జ్యోతిప్రసాద్, డీపీఎం సుబ్బారావు, పంచాయతీ రాజ్ ఏఈ హనుమంతురావు, గృహనిర్మాణ ఏఈ కిషోర్ ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోండి


వైదనలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

బల్లికురవ: స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకారం అందించాలని ఎంపీడీఓ కుసుమ కుమారి కోరారు. మంగళవారం వైదన గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్రాపై జరిగిన గ్రామ సభకు సర్పంచ్ మేడా జయలక్ష్మి అధ్యక్షత వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ రోడ్ల వెంబడి ఎరువు దిబ్బలు వ్యర్థాలు వేయకుండా పంచాయతీ అధికారులకు ప్రజలు సహకరించాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున పారిశుధ్య కార్యక్రమాలను 3 నెలలపాటు నిరంతరంగా కొన సాగించాలన్నారు. అప్పుడే సీజనల్ జ్వరాలు వ్యాధులకు చెక్ పెట్టవచ్చని చెప్పారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు కృషి చేయాలరు. సెక్రటరీ ప్రసాదరావు, వార్డు సభ్యులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


యోగా శిక్షణలో ఎన్‌సీసీ క్యాడెట్‌లు

వేటపాలెం: ప్రతి రోజూ యోగా చేయడం వల్ల వారికి సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉంటారని పెద్దగంజాం వైద్యాధికారి వై. భవాని పేర్కొన్నారు. చీరాల ఇంజినీరింగ్ కళాశాల్లో జరుగుతున్న ఎన్‌సీసీ క్యాంపులో భాగంగా క్యాడెట్స్‌కి యోగా, ఏరోబిక్స్ సాధనపై మంగవారం అవగాహన కల్పించారు. యోగాసనాలు వేసి క్యాడెట్‌లకు యోగా వల్ల కల్గే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 21వ తేదీన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా యోగా అవగాహన కల్పిస్తూ విస్తృత ప్రచారం నిర్వహించ బడుతొందని తెలిపారు. డాక్టర్ శ్రీనివాస్, యోగా అవార్డు గ్రహీత గొర్ల పార్థసారధి, పీడీ గొర్ల గోపీ, సుభేదార్ మేజర్‌నజీర్ అమ్మద్, మేజర్‌బీఎస్ఆర్‌కే రాజు, రమేష్, పి. సురేష్, టి. వెంకటేశ్వర్లు, నివాసరావు, ఫాతిమా, దివ్య పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి


అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

ఇంకొల్లు(చినగంజాం): ప్రభుత్వ ఆదేశాల మేరకు పెండింగ్ ఉన్న గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని ఎంపీడీఓ ఏ. శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలనను అనుసరించి జూన్ 10వ తేదీ నాటికి పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణాలను పూర్తి చేయాల్సిందిగా సూచించారు. 2021-22 లెక్కల ప్రకారం ఇంకొల్లు మండలానికి 1036 గృహాలు మంజూరు కాగా అందులో 22 పూర్తయ్యాయని, 19 శ్లాబ్ దశలో ఉన్నాయని, 69 బేస్‌మెంట్ దశలో ఉన్నాయని 41 బేస్‌మెంట్ లెవెల్‌కు తక్కువలో ఉన్నాయని తెలిపారు. మొదలు పెట్టనివి 343 ఉన్నాయని ఆయన తెలియజేశారు. గృహ నిర్మాణ శాఖ ఏఈ రామకృష్ణ, అసిస్టెంట్ ఇంజినీర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముక్తేశ్వరంలో డ్రోన్ కెమెరాతో నిఘా


ముక్తేశ్వరంలో డ్రోన్ కెమెరాను ప్రాంభించిన ఎస్సై

బల్లికురవ: గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని ఎస్సై వై. నాగరాజు హెచ్చరించారు. ఇటీవల మండలానికి దాత ఇప్పల అంజిరెడ్డి డ్రోన్ కెమెరాను అందజేశారు. మంగళవారం ముక్తేశ్వరం గ్రామంలో ప్రారంభించారు. గ్రామం నుంచి బూసావారిపాలెం వెళ్లే రోడ్డులోని కొండపై వెంచేసి ఉన్న ముక్తిలింగేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే దారిలో మద్యం సేవిస్తున్నట్లు, జూదం ఆడుతున్నట్లు సమాచారం అందటంతో ప్రత్యేనిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే డ్రోన్ కెమోరాతో సులభంగా గుర్తిస్తామని ఎస్సై వివరించారు.

వేసవి విజ్ఞాన శిబిరాలతో విజ్ఞానం


నెహ్రూ, వీరేశలింగం పంతులు చిత్రపటాలకు పూలమాలు వేస్తున్న లైబ్రేరియన్

అద్దంకి రూరల్: గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించటం వలన విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందుతుందని సంతమాగులూరు లైబ్రేరియన్ బాదం విజయభాస్కరరెడ్డి అన్నారు. మంగళవారం సంతమాగులూరు శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు యోగా నేర్పించారు. అనంతరం జవహర్‌లాల్ నెహ్రూ, కందుకూరి వీరేశలింగం వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. లైన్‌మెన్ ఎస్. కుమార్, 21 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

అర్జీల విచారణ సత్వరం చేయండి

చీరాల టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా విచారించి పరిష్కరించాలని తహసీల్దార్ కుర్రా గోపికృష్ణ సూచించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ, పట్టణ వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాలు, సచివాలయాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలు, పాస్ పుస్తకాలు, పీజీఆర్ఎస్ అర్జీలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో, సచివాలయాల్లో పనిచేసే వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు స్పందన అర్జీలను త్వరగా విచారించాలన్నారు. ప్రజలకు జవాబుదారీతనంగా రెవెన్యూ ఉద్యోగులు పనిచేయాలని, విధుల్లో అలసత్వం వహించిన వారిపై శాఖా పరమైన చర్యలు తప్పవన్నారు. గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న పట్టాదారు పాస్‌పుస్తకాలను త్వరగా అందించడంతో పాటు గ్రామాల్లో ఎక్కడా కూడా అనధికార లే అవుట్లు వేయకుండా కట్టడి చేయడంతో పాటుగా నీటి తీరువా వసూళ్లు చేయాలన్నారు. డీటీ సుశీల, ఆర్ఐలు శేఖర్, సత్యం, వీఆర్వోలున్నారు.

నాటుసారాతో జీవితాలు నాశనం


నాటుసారా నిర్మూలనపై నిర్వహిస్తున్న కళాజాత

చీరాల: నాటుసారా నిర్మూలనపై మంగళవారం చీరాల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. నాటుసారా వినియోగించే గ్రామాలైన రామ్‌నగర్, ఆదినారాయణపురం, ఈపూరుపాలెం, వాడరేవు సునామికాలనీ, రామాపురం గ్రామాల్లో నాటుసారా నిర్మూలన 2.0లో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా కళాజాత నిర్వహించామన్నారు. నాటుసారాతో ఎన్నో అనర్థాలున్నాయన్నారు. ఆరోగ్యం దెబ్బతిని అనారోగ్యానికి గురవుతారన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా మేనేజర్ డి.ఇమ్మానియేలు, డి-అడిక్షన్ సెంటర్ ప్రాజెక్టు డైరెక్టర్ సయ్యద్, నాగూర్ బాషా, సీనియర్ కౌన్సిలర్ షేక్ బషీర్, ఎక్సైజ్ ఎస్సై బి.శ్రీహరి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు

అద్దంకి: ఇంటింటి సర్వేతో బడిఈడు కలిగిన ప్రత్యేక అవసరాల కలిగిన పిల్లలను గుర్తించనున్నట్లు మండల విద్యాశాఖాధికారి బూదాటి సుధాకర్ అన్నారు. మండలంలో మంగళశారం పిల్లల గుర్తింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. గుర్రాల కాలనీలో భవిత కేంద్రం ఉపాధ్యాయులు కొంగల శ్రీనివాసు, పాలపర్తి యోనా సందర్శించి సర్వే నిర్వహించి ముగ్గురు వైకల్యం గల పిల్లలను గుర్తించినట్లు చెప్పారు.

ఉత్సాహంగా టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్

ఇంకొల్లు(చినగంజాం): గాదె వీరారెడ్డి మెమోరియల్ ప్రీమియర్ లీగ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా పావులూరులో మంగళవారం మూడు మ్యాచ్‌లు నిర్వహించారు. దగ్గుబాడు సమత యూత్, జరుబుల వారిపాలెం ఫ్రెండ్స్ యూత్ మధ్య మొదటి మ్యాచ్ నిర్వహించగా దగ్గుబాడు సమత యూత్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్నారు. నిర్ణీత 10 ఓవర్లలో 49 పరుగులు చేసి ఆల్‌ఆవుట్ అయ్యారు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన జరుబులపాలెం ఫ్రెండ్స్ యూత్ 35 పరుగులకు ఆల్‌అవుట్ అయ్యారు. 14 పరుగుల తేడాతో దగ్గుబాడు సమత యూత్ జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్ సూదివారిపాలెం అంబేడ్కర్ యూత్ జట్టు, నక్కలపాలెం అంబేడ్కర్ యూత్ జట్టు మధ్య జరిగింది. మొదట టాస్ గెలిచిన నక్కలపాలెం జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 105 పరుగులు చేయగా తరువాత బ్యాటింగ్ చేసిన సూదివారిపాలెం జట్టు 70 పరుగులకే ఆల్‌అవుట్ అయింది. 35 పరుగుల తేడాతో నక్కలపాలెం జట్టు విజయం సాధించింది. మూడో మ్యాచ్ వలపర్ల క్రిష్టియన్ యూత్ జట్టు. ఇంకొల్లు అంబేడ్కర్ యూత్ జట్టు మధ్య నిర్వహించగా మొదట టాస్ గెలిచిన వలపర్ల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో నాలుగు వికెట్లు నష్టపోయి 68 పరుగులు చేసింది. తరువాత బ్యాటింగ్ చేసిన ఇంకొల్లు అంబేడ్కర్ యూత్ 51 పరుగులు చేసి ఆల్‌అవుట్ అయింది. 17 పరుగులు తేడాతో వలపర్ల జట్టు విజయం సాధించింది.

ట్రాఫిక్ నియంత్రణకు కోన్ల వితరణ


ట్రాఫిక్ నియంత్రణలో పాల్గొన్న ఎస్ఐ సురేష్

ఇంకొల్లు(చినగంజాం): ఇంకొల్లులో ట్రాఫిక్ నియంత్రణ కోసం అవసరమైన కోన్లను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ డీలర్ బెల్లంకొండ వాసుదేవరావు అందజేసినట్లు ఎస్ఐ సురేష్ మంగళవారం తెలిపారు.

మొత్తం 50 కోన్లు సమకూర్చినట్లు వివరించారు. ఇంకొల్లులో ఇప్పటికే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, గురువారం నాటికి ఇంకొల్లు బస్టాండ్‌లో మరో రెండు కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఏఎస్ఐ నాగలక్ష్మి, స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీరు దుర్వినియోగం చేస్తే చర్యలు


అద్దంకి బ్రాంచ్ కాలువలో నీటి ప్రవాహం

బల్లికురవ: తాగునీటి అవసరాల నిమిత్తం ప్రభుత్వం సాగర్ కుడి కాలువ ద్వారా అద్దంకి బ్రాంచ్ కాలువకు నీరు విడుదల చేసిందని తహసీల్దార్ రవినాయక్ మంగళవారం తెలిపారు. మండలంలోని నోటిఫైడ్, నాన్ నోటిఫైడ్ చెరువులన్నింటినీ పూర్తి స్థాయిలో సాగర్ నీటితో నింపుకోవాలన్నారు. వల్లాపల్లి లాకులు 33/2 వద్దకు 600 నుంచి 650 వరకు క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. రైతులు పంటపొలాలకు, కాంట్రాక్టర్లు చేపల చెరువులకు నీటి మళ్లిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నైరుతి రుతుపవనాలు అల్ప పీడన ప్రభావంతో ఉరుములతో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని గ్రామాల్లోని ప్రజలు రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పొలాల్లోని చెట్లను ఆశ్రయించవద్దని హెచ్చరించారు.

కూటమి ప్రభుత్వంలో దళితులపై దాడులు



మాట్లాడుతున్న దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు జూలియన్

చీరాల రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో దళితులపై దాడులు పేట్రేగిపోతున్నాయని దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మాచవరపు జూలియన్ అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తెనాలి ఐతానగర్‌లో కొందరు దళిత, మైనార్టీ యువకులు మద్యం తాగితే ఓ కానిస్టేబుల్ ఆ యువకులను డబ్బులు డిమాండ్ చేశాడన్నారు. అయితే ఆ యువకులు డబ్బులు ఇవ్వకపోవడంతో ఆ కానిస్టేబుల్ తనపై యువకులు దాడిచేశారని వారిపై తప్పుడు కేసు నమోదు చేయించారన్నారు. అలాగే రెండో, మూడో పట్టణ సీఐలతో ఆ యువకులను నడిరోడ్డుపై కూర్చోబెట్టి లాఠీలతో ఇష్టానుసారంగా కాళ్లు పగిలేలా కొట్టి హింసించారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిలో ఒక యువకునికి కాళ్లలో రాడ్లు ఉన్నాయని కొట్టవద్దని ప్రాధేయపడినప్పటికీ ఏ మాత్రం కనికరం చూపకుండా యువకుని కాళ్లపై ఓ సీఐ నిలబడి మరో సీఐతో కొట్టించడం సహించరాని విషయమని పేర్కొన్నారు. యువకులు తప్పుచేస్తే చట్టబద్ధంగా వారిపై కేసులు నమోదుచేసి కోర్టు హాజరుపరచాలే కానీ నడిరోడ్డుపై లాఠీలతో చావ కొట్టమనే అధికారం పోలీసులకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో ఏమి చేసినా చెల్లుతుందని, దళితులను కొడితే ఎవరూ మాట్లాడరనే అహంకారంతోనే పోలీసులు ఈ విధమైన చర్యలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. రాష్ట్ర హోం మంత్రి దళితురాలైయుండి కూడా ఈవిధమైన చర్యలను ప్రోత్సహించడం దారుణమన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగంలో దళితులకు ఇచ్చిన హక్కులను కూటమి ప్రభుత్వ పెద్దలు కాలరాస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో మల్లెల బుల్లిబాబు, మేరిగ రమేష్ బాబు, సలగల కెనడి, చప్పిడి ప్రియతం పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉత్తమ భవిత


విద్యార్థినికి బహుమతి, జ్ఞాపిక అందజేస్తున్న నిర్వాహకులు

జె.పంగులూరు: ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకొని, ఉన్నత శిఖరాలను చేరుకోవాలని, తల్లిదండ్రుల కళ్ళల్లో ఆనందాన్ని చూడాలని చీరాల డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి డి. గంగాధర్ రావు అన్నారు. కీర్తిశేషులు వద్దవల్లి అజిత్ కుమార్ 51 జయంతి సందర్భంగా 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అజిత్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ తరఫున అభినందన సభ మంగళవారం నిర్వహించార. చందలూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు గిరిజ అధ్యక్షతన సభ వహించారు. ట్రస్ట్ ద్వారా పాఠశాలలో గంథాలయాన్ని నిర్మించి విద్యార్థులకు ప్రోత్సాహాన్ని అందిస్తున్న వడ్డవల్లి వీరనారాయణను ఆయన అభినందించారు. విద్యార్థులు సర్టిఫికెట్లు, షీల్డ్, బహుమతులు అందజేశారు. రేష్మ, సుస్మితల భరతనాట్యం కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నలిచాయి. రిటైర్డ్ ప్రిన్సిపాల్ బీరం సుందరావు, రిటైర్డ్ ఇంజినీర్ పేర్ని వీరనారాయణ, మండల విద్యాశాఖ అభికారి జి. వీరాంజనేయులు, అజిత్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరనారాయణ, డాక్టర్ కొర్రపాటి సుధాకర్, రిటైర్డ్ హెచ్ఎం నార్నె తాతయ్య, హెచ్ఎంలు ఇమ్మడిశెట్టి అనిత, సుమతి, ఇంకొల్లు విద్యా శాఖ అధికారి శ్రీనివాస్, డాక్టర్ కె. ర ఘచంద్ పాల్గొన్నారు.

సైన్స్‌తో సామాజిక వికాసం


పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

చీరాల: సైన్సు లేనిదే సమాజం లేదని, ఆదిమానవుడు నేటి సమాజంలో అత్యున్నత స్థాయికి ఎదిగాడంటే దానికి సైన్స్ మూలకారణమని హైమా హాస్పిటల్ ఎండీ డాక్టర్ గుంటుపల్లి సుబ్బారావు అన్నారు. మంగళవారం స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పుస్తకాలు పిలుస్తున్నాయనే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి డాక్టర్ గుంటుపల్లి సుబ్బారావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సోషల్ మీడియా ప్రభావంతో ప్రజలు పుస్తకాలు చదవడం మానేశారని, పుస్తకాలు చదవడం వల్ల శాస్త్రీయ విజ్ఞానం అలవడుతుందన్నారు. మూఢనమ్మకాలను వీడి సైన్స్‌పై పరిజ్ఞానాన్ని పెంచుకుని సమాజంలో మానవుడు మరింతగా ముందుకు సాగాలన్నారు. జనవిజ్ఞానవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు మాట్లాడుతూ జ్ఞాన సంపాదనకు పుస్తకాలే సాధనాలన్నారు. నేటి సమాజంలో చిన్న పిల్లల నుంచి పెద్దవాళ్ళ వరకు ఆసక్తికరంగా సైన్స్‌పై మరింతగా అవగాహన పెంచే పుస్తకాలన్నీ ఈ స్టాల్స్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు భాస్కరరావు, డివిజన్ నాయకులు బి.పిచ్చయ్య, హేమంత్‌కుమార్, యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు బండి భిక్షాలుబాబు, మాల్యాద్రి, కుర్రా శ్రీనివాసరావు, లింగం జయరాజు, నారపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

1833 మంది పొగాకు రైతుల పేర్లు నమోదు

ఇంకొల్లు(చినగంజాం): ఇంకొల్లు మండల పరిధిలో నల్లబర్లీ, వైట్ బర్లీ పొగాకు సేద్యం చేసిన రైతులు 1833 మంది రైతుల పేర్లను నమోదు చేసినట్లు మండల వ్యవసాయాధికారి వేణుగోపాల్ తెలిపారు. ఆర్బీకేల ద్వారా పొగాకు రైతుల వివరాలను సేకరించినట్లు తెలిపారు. మండలంలో 8 వేల ఎకరాల్లో లక్ష క్వింటాళ్ల పొగాకు రైతులు పండించినట్లు ఆయన తెలియజేశారు. రైతులు తమ సందేహాలను కార్యాలయం సమీపంలో సంప్రదించాలని తెలియజేశారు.